## క్లుప్తంగా

### గురు పౌర్ణమికి ఏర్పాట్లు

అగనంపూడి: గురుపౌర్ణమిని ఈ నెల 21న ఘనంగా నిర్వహించనున్నట్లు అగనంపూడి షిర్డీ సాయి మందిరం కమిటీ చైర్మన్ కొయ్య వెంకటరమణారెడ్డి తెలిపారు. అగనంపూడిలోని షిర్డీ సాయి మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు బాబాకు అన్నాభిషేకం, విశేష పూజల అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ధర్మాల వ్యాసశర్మ, ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఓబీసీ లైజన్ ఆఫీసర్‌కు అభినందనలు


నూతన లైజన్ ఆఫీసర్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ నూతన లైజన్ ఆఫీసర్‌గా నియమితులైన ఎస్.ఉమామహేశ్వరరావును పలువురు అభినందించారు. ఓబీసీ అసోసియేషన్ నాయకులు గురువారం ఆయన్ను కలిసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, యు.శ్రీనివాస్, కోయిలాడ శ్రీనివాసరావు, వి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

### రెండో రోజూ కదలని క్లాప్ వాహనాలు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో క్లాప్ ఆటోల సమ్మె రెండో రోజు కూడా కొనసాగింది. తమ జీతాలను వెంటనే చెల్లించాలని.. తమ జీతాలనుంచి ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ పేరుతో మినహాయిస్తున్న మొత్తాన్ని సంబంధిత సంస్థలకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మెరుపు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు కార్మిక నాయకులతో మాట్లాడి గురువారం జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, ఆ హామీ నెరవేరకపోవడంతో క్లాప్ డ్రైవర్లు వాహనాలను తిప్పడానికి నిరాకరించారు. దీంతో వాహనాలన్నీ పార్కింగ్ స్థలానికే పరిమితమైపోయాయి.

### తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి టీవీ అందజేత


దివ్యక్షేత్రం ప్రతినిధులకు ఎల్‌ఈడీ టీవీ అందిస్తున్న చంద్రమౌళి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి షీలానగర్‌కు చెందిన వ్యాపారవేత్త చింతల చంద్రమౌళి, లక్ష్మి దంపతులు 55 అంగుళాల ఎల్‌ఈడీ టీవీని అందజేశారు. గురువారం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు టీవీ బహూకరించారు.

### మాధవునిగా మారిన మనిషి కథే 'బ్రహ్మసో విష్ణు' చిత్రం

దాబాగార్డెన్స్: అందరూ చూడాల్సిన సినిమా 'బ్రహ్మసో విష్ణు'అని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రమా తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా విడుదల అవుతున్న ఈ హిందీ చిత్రానికి సుప్రసిద్ధ దర్శకుడు ముప్పలనేని శివ దర్శకత్వం వహించారని తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాక్షాత్తు భగవంతుని ప్రేరణతో సామాన్య మానవుడు మాధవునిగా ఎలా పరివర్తన చెందాడన్నదే బ్రహ్మసో విష్ణు సినిమా కథాంశం అన్నారు. ప్రజాపిత బ్రహ్మ బాబా దివ్య జీవిత చరిత్ర, బ్రహ్మకుమారీ, కుమారుల పవిత్ర వైవిధ్య జీవన శైలిని ఈ సినిమా ప్రతిబింబిస్తుందన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో గాజువాక లక్ష్మీకాంత్, మధురవాడ కృష్ణా మినీ ఫ్లెక్స్ థియేటర్లలో ఉదయం 9.30 గంటలకు ఈ సినిమా ప్రదర్శన ఉంటుందన్నారు. సినీ నటుడు ప్రసన్న కుమార్, సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ధనుంజయ్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# రహదారి విస్తరించారు.. కల్వర్టులు విస్మరించారు

- రూ.7.75 కోట్లతో రహదారి విస్తరణ
- కల్వర్టులు నిర్మించక కుదించుకుపోయిన మార్గం
- నిలిచిపోతున్న ట్రాఫిక్
- వాహనచోదకుల అవస్థలు


వెదుళ్లనరవ కాలనీ వద్ద కల్వర్టులు నిర్మించక పోవడంతో కుదించుకుపోయిన రహదారి


కొత్తూరు సాయిబాబా ఆలయం వద్ద కల్వర్టు వద్ద మధ్యలో వదిలేసిన రహదారి

అగనంపూడి: కోట్ల రూపాయలతో రహదారులు విస్తరించినా కల్వర్టుల వద్ద పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సెక్టార్-1 (కొత్తూరు) జంక్షన్ నుంచి నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు రెండున్నర కిలోమీటర్ల నిడివిలో రహదారిని నలభై అడుగుల మేర విస్తరణ పనులకు ఆరు మాసాల క్రితం శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ సత్వరం పనులు పూర్తి చేయాలని భావించి నాలుగు పద్దులుగా విభజించి రూ.7.75 కోట్ల వ్యయంతో రహదారి విస్తరణ పనులు ప్రారంభించింది. మూడు మాసాల క్రితం రహదారి విస్తరణ పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు కల్వర్టులకు రెండు వైపులా రహదారి విస్తరణ పనులతో పాటు కల్వర్టుల విస్తరణ పనులు నిలిపివేశారు. దీంతో రహదారి విస్తరించినా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గంలో గాజువాక, సబ్బవరం మండలాల మధ్య గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. గాజువాక నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ మీదుగా సబ్బవరం, చోడవరం వరకు సిటీ బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో ఈ మార్గంలో బస్సు సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది. వీటితో పాటు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కల్వర్టుల వద్ద కేవలం 12 అడుగుల వెడల్పులోనే రహదారి ఉండడంతో ఇక్కడ వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. దీంతో వాహనచోదకులకు నిరీక్షణ తప్పడం లేదు. కల్వర్టుల వద్ద రహదారి పూర్తిగా ధ్వంసం కావడం కూడా ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. జీవీఎంసీ అధికారులు సత్వరం కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వెదుళ్లనరవ వద్ద మధ్యలో వదిలేసిన కల్వర్టు

## ఇష్టపడి చదివితే అత్యున్నత శిఖరాలు


బంగారు పతకం అందుకున్న విద్యార్థినితో అతిథులు

గాజువాక: మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని, చదువులో సైతం తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పాఠ్యాంశాలను కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవడం ద్వారా అత్యుత్తమ శిఖరాలను చేరుకోవచ్చన్నారు. స్థానిక చైతన్య మహిళా కళాశాల 28వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు ఉద్యోగావకాశాలను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోందన్నారు. ఏయూ ప్రొఫెసర్ లావణ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టి పెడితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ శకుంతల, డైరెక్టర్ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణమయ్య సంకీర్తనా జయంతి


కృష్ణమయ్య విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న వైదికులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఆషాఢ ద్వాదశిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం కృష్ణమయ్య సంకీర్తనల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉన్న కృష్ణమయ్య విగ్రహం వద్ద దేవస్థానం అర్చకులు షోడశోపచార పూజలు నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. కృష్ణమయ్య రచించిన వచన సంకీర్తలను స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆలపించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. తిరుమల అన్నమాచార్యుల వలే సింహాచల క్షేత్రంలో శ్రీకాంత కృష్ణమాచార్యులు ప్రసిద్ధి చెందినవారు. సింహాద్రినాథుడిపై ఆయన చాతుర్లక్ష వచన సంకీర్తనలు రచించారు. ఆసంకీర్తనలు రచించిన రోజు ఆషాఢ ద్వాదశి కావడంతో ఏటా ఆరోజు కృష్ణమయ్య సంకీర్తనల జయంతిని నిర్వహిస్తుంటారు.

## అల్పపీడనంతో అల్లకల్లోలంగా సముద్రం


సురక్షిత ప్రదేశంలో భద్రపర్చుకున్న పడవలు


వలలను జాగ్రత్త చేసుకుంటున్న గంగపుత్రులు

పరవాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి అలల ఉధృతి అధికంగా ఉంది. రాత్రి వేళ అలల ఉధృతి మరింత ఎక్కువగా ఉంటుందని మత్స్యకార్మికులు చెప్పారు. అధికారుల హెచ్చరికలతో ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, తిక్కవానిపాలెం, జాలారిపేట మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. తీరంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న పడవలు, వలలు, ఇంజిన్లను సురక్షిత ప్రాంతాలకు తరలించి జాగ్రత్త పడ్డారు. సముద్రం అనుకూలంగా లేని కారణంగా వారం రోజులుగా గంగపుత్రులు చేపల వేటకు వెళ్లడం లేదు. ఇంతలో తుఫాను రావడంతో మరో మూడునాలుగు రోజుల వేట మానుకోవడం వల్ల పూట గడవడం కష్టంగా ఉందని ముత్యాలు అనే మత్స్యకారుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి సాయం ఇంతవరకు అందక పూట గడవడం కష్టంగా ఉందంటున్నారు. ప్రభుత్వం గంగపుత్రుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వెంటనే సమస్యను పరిష్కరించాలని వేడుకొంటున్నారు.

## తప్పిపోయిన పాప నిమిషాల్లో తల్లిదండ్రుల చెంతకు..


తండ్రి వద్ద ఉన్న పాప

జగదాంబ: మొహర్రం ఊరేగింపుల్లో తప్పిపోయిన పాపను పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మొహర్రం సందర్భంగా వివిధ మసీదుల నుంచి ఊరేగింపుగా వచ్చిన ముస్లింలు పోలీసు కమిషనర్ కార్యాలయం పక్కన ఉన్న వైశాఖీ జల ఉద్యానవనంలో అనుపు కార్యక్రమం నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వారిలో జనసందోహం మధ్య భూపేష్‌నగర్‌కు చెందిన ఎండీ అశ్వక్, ఖుష్బూలకు చెందిన పాప తప్పిపోయింది. అయితే అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీసు ఆఫీసర్‌కు విషయం తెలియపరచగా వెంటనే స్పందించి 25 నిమిషాల్లో పాపను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

## హాస్టల్స్‌లో పరిశుభ్రత లోపిస్తే చర్యలు

మధురవాడ : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పరిశుభ్రత, నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం మధురవాడ సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం, కళాశాల బాలుర వసతి గృహం - 1లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. బాలుర వసతి గృహంలో విద్యార్థులుండే గదుల్లోనే దుస్తులు ఆరబెట్టడం, అపరిశుభ్ర వాతావరణాన్ని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న సమీకృత వసతి గృహం కూడా పరిశీలించారు.

## 1253వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి ఉత్పత్తికి విఘాతాలు కల్పించారని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు పెదిరెడ్ల హరనాథ్, ఎల్.వి.రమణ ఆరోపించారు. అప్పటి నుంచి ఉత్పత్తి నిలిచిపోవడంతో భారీ యంత్రాల్లో విషవాయువులు పేరుకుపోయి పరిశ్రమలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1253వ రోజు బుధవారం, వారు మాట్లాడారు. 7మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నడిపేందుకు వీలుగా ఏర్పాటు చేసిన యంత్ర పరికరాలు నేడు వాడకం లేక తుప్పపట్టి మూలకు చేరే పరిస్థితి కల్పించారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరును ఆసరాగా తీసుకొని కొంతమంది ఉన్నతాధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉక్కుకు నష్టం చేకూర్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హరి, సత్యనారాయణ, రామారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయోగాత్మక హాల్ట్‌ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు ఆయా స్టేషన్లలో కల్పించిన ప్రయోగాత్మక హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. భువనేశ్వర్-సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగించారు. విశాఖపట్నం-మహబూబ్‌నగర్(12861) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు మధిర స్టేషన్‌లో హాల్ట్‌ను కొనసాగించారు. పూరీ-తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్‌కు, బిలాస్‌పూర్-తిరుపతి(17481) ఎక్స్‌ప్రెస్‌కు చిన్న గంజాం స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది. గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్‌కు భీమడోలు స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది.

## విశాఖపట్నం-పలాస గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం -పలాస (07470) మెము రైలు ఈ నెల 22, 25, 27 తేదీల్లో శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో పై తేదీల్లో పలాస-విశాఖపట్నం (07471) మెము రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరుతుంది.

## కొచ్చువేలి-బరౌని మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొచ్చువేలి-బరౌని మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. కొచ్చువేలి -బరౌని (06091) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొచ్చువేలిలో ఈ నెల 20న ఉదయం 8 గంటలకు బయల్దేరి 21న ఉదయం 11.45 గంటలకు దువ్వాడకు.. 22న మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరౌని-కొచ్చువేలి (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బరౌనిలో ఈ నెల 23వ తేదీ 11.30 గంటలకు బయల్దేరి మూడో రోజు తెల్లవారు 5.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.30 గంటలకు బయల్దేరి శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటకు కొచ్చువేలి చేరుకుంటుంది.

## 20న ఉక్కు కేవీలో ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఈనెల 20న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. పీజీటీ విభాగంలో కామర్స్, ఎకనామిక్స్, టీజీటీ విభాగంలో ఇంగ్లిష్, సంస్కృతం, సైన్స్, సోషల్ సైన్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధృవపత్రాలతో ఆ రోజు విద్యాలయానికి హాజరు కావాలన్నారు.

## కేంద్రం కుట్రతోనే సంక్షోభంలో ఉక్కు పరిశ్రమ

సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్


సదస్సులో ప్రసంగిస్తున్న తపన్‌సేన్


హాజరైన కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం కుట్రలతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్ నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ విమర్శించారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉక్కు ట్రైనింగ్ ఆడిటోరియంలో 'సంక్షోభంలో విశాఖ ఉక్కు-పరిష్కారం ఎలా' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నేటికీ కొనసాగిస్తున్నదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకుంటామన్న ప్రభుత్వం సెయిల్‌లో విలీనం చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తక్షణమే సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు . స్టీల్ ప్లాంట్ మాజీ సీఎండీ వై.శివసాగరరావు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు స్టీల్ వినియోగంపైనే ఆధారపడి ఉందన్నారు. స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా మాట్లాడుతూ పరిశ్రమ తల్లి లాంటిదని దీనిని కాపాడుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ కె.కె.రావు, మాజీ ఈడీ జి.ఎస్.ఎన్.మూర్తి, సీఐటీయూ కూటమి నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, యు.రామస్వామి, సన్యాసిరావు, డి.వి.రమణారెడ్డి, డి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు ఉత్పత్తికి ముడి పదార్థాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ముడిపదార్థాలు అందజేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్లాంట్ ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో మరలా ముడి పదార్థాల కొరత ఏర్పడిందన్నారు. దాని వల్ల ఉత్పత్తి తగ్గించాల్సి వస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం సెయిల్, ఎన్ఎండీసీ ద్వారా ప్లాంట్‌కు అవసరమైన ముడి పదార్థాలు అందజేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.వి.రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ.నాయుడు, డి.మోహన్, బి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటి మళ్లింపునకు చర్యలు


పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఇల్లపు ప్రసాద్

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న డ్రైనేజీలో మురుగునీటిని మళ్లించే పనులు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పైపులైన్‌ను అమర్చే పనులు జరుగుతున్నాయి. ఈ పనులను వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు ప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మురుగు నీటి నిల్వ కారణంగా దోమలు, పందులు చేరడంతో పడుతున్న ఇబ్బందులను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో సత్వరం పైపులైన్ అమర్చే పనులు చేపట్టారన్నారు. అలాగే గ్రామంలోని రామాలయంలో మల్టీ పర్పస్ హాలు నిర్మాణానికి అదనపు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు పూర్తి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, పట్టా పైడి రత్నం, బుదిరెడ్డి అప్పారావు, వడ్డాది శ్రీను, ఐఆర్‌సీహెచ్ అప్పారావు, గవర నాయుడు పాల్గొన్నారు.

## షిర్డీసాయి శాంతిధామంలో గురుపూర్ణిమ ఉత్సవాలు


షిర్డీసాయి శాంతిధామంలో సాయి చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో గురుపూర్ణిమ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు లలిత, విష్ణు సహస్ర నామాలతో పాటు సాయి చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 19న శుక్రవారం ఉదయం కోలాటం, సాయంత్రం రథోత్సవం, 20న కాకడ హారతి, సామూహిక సాయి సత్య వ్రతాలు చేయనున్నట్లు చెప్పారు. 21న గురు పౌర్ణమి సందర్భంగా ధుని పూజ, పాలు, చెక్కెర, విభూది అభిషేకాలను భక్తుల స్వహస్తాలతో చేయించనున్నారు. బాబాకు 108 రకాల మిఠాయిలతో మహానైవేద్యం సమర్పించనున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని తెలియజేశారు.

## ఎర్రమట్టి దిబ్బల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

సీతంపేట: అధికారుల సహకారంతోనే సహజ వనరుల దోపిడీ జరుగుతోందని, ఉదాసీనత వహిస్తే వారిపై కేసులు వేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జాతీయ గనుల మంత్రిత్వ శాఖ దేశంలో ప్రముఖ జ్యూలాజికల్ హెరిటేజ్ సైట్స్ లిస్టు చేస్తూ 32 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వాలు సంరక్షించి నిర్వహణ చేయాలని 2016లో గనుల శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందులో ముఖ్యమైన ఎర్రమట్టి దిబ్బలను రక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ విషయంలో పార్టీలకతీతంగా సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వారసత్వ సంపదగా గుర్తించిన ఎర్రమట్టి దిబ్బల సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఈ వారసత్వ సంపద వినాశనానికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఎర్ర మట్టి దిబ్బలను సర్వేచేసి బఫర్ జోన్ గుర్తించాలని తెలిపారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న విజయ్ భాస్కర్

పెందుర్తి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సమగ్ర శిక్ష రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలకు తొమ్మిది రోజుల శిక్షణ తరగతులను పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన అబ్జర్వేషన్లను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.సువర్ణ, జిల్లా సహాయ ఎ.ఎం.వో జి.లక్ష్మి, పెందుర్తి ఎంఈవో-2 మధుమూర్తి పాల్గొన్నారు.

## ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాల గడువును పొడిగించినట్లు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ ధర్మారావు ప్రకటనలో తెలిపారు. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులుhttps:// ignouadmission. samarth. edu.in/ను సందర్శించి.. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూలై 31వ తేదీతో గడువు ముగుస్తుందని, వివరాలకు ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.